
నెల్లూరు నగర ముఖద్వారం ఆటోనగర్ వద్ద జోరు వానలో వాహనాల రాకపోకలు

స్తంభించిన నగరం

నెల్లూరు నగరంలోని ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీల సమీపంలో ఇళ్లలోకి నీరు చేరాయి. జోరువానలో తడుస్తూనే కూరగాయలు, పండ్ల వ్యాపారులు వ్యాపారాలు చేశారు. చాలా ప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత దుకాణాలు మూతపడ్డాయి.

దూసుకొస్తున్న.. వాయుగండం!

- జిల్లాకు భారీ వర్ష ముప్పు
- తీరం దాటే సమయంలో ఆకస్మిక వరదలకు అవకాశం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న యంత్రాంగం

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో గురువారం తీరం దాటే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో.. భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే అప్రమత్తమైన అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు.. పలువురిని పునరావాస కేంద్రాలకు తరలించింది. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు జిల్లాలో పర్యటిస్తూ.. ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

జలాశయాలకు వరద హోరు

సోమశిల జలాశయం సామర్థ్యం 78 టీఎంసీలు కాగా- ప్రస్తుతం 53 టీఎంసీలు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 20,171 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా- కండలేరుకు ఆరు వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కనిగిరి మండలం గండిపాళెం రిజర్వాయరులో 0.09 టీఎంసీలు మాత్రమే ఉంది. కనిగిరి జలాశయం సామర్థ్యం 3.45 టీఎంసీ కాగా.. ప్రస్తుతం 1.81 టీఎంసీల నిల్వ ఉంది. సంగం బ్యారేజీ 12 గేట్లు ఎత్తి.. నీటిని దిగువకు విడుదల చేస్తుండగా.. నెల్లూరు బ్యారేజీ రెండు గేట్ల ద్వారా నీటిని సముద్రానికి వదులుతున్నారు.

నేడూ.. విద్యా సంస్థలకు సెలవు

విద్యా సంస్థలకు గురువారం కూడా సెలవు ప్రకటించారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు సెలవు ఇచ్చినట్లు డీఈవో రామారావు, ఆర్ఐవో శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు 17న జరగాల్సిన త్రైమాసిక పరీక్షను వాయిదా వేశామని.. తిరిగి 24న జరుగుతుందని ఆర్ఐవో వెల్లడించారు.

పోటెత్తుతున్న వాగులు

జిల్లాలో. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చేజర్లలో పందలవాగు, నల్లవాగు, కావలి-కొండాపురం రోడ్డులోని సప్తాలు, మిడతవాగు, పెదపవని వద్ద ఉప్పుటేరు, వలేటివారిపాలెం మండలంలో ఉబ్బలవాగు, కందుకూరు-గుడ్లూరు మధ్య ఎర్రవాగు, వరికుంటపాడులో పిల్లాపేరు, ఉప్పు వాగుల్లో ప్రవాహం ఉద్ధృతంగా ఉంది. పోలీసు, రెవెన్యూ అధికారులు అటువైపు ఎవరూ వెళ్లకుండా పహారా కాస్తున్నారు. విడవలూరు మండలం గాదెలదిన్నె సమీపంలో పైడేరు వాగు కట్టకు గండి పడగా.. మరమ్మతులు చేపట్టారు.


నెల్లూరులో పోలీసు కాలనీకి వెళ్లేదారిలో...


గంగపట్నం పునరావాస కేంద్రంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ మాటామంతి


నెల్లూరు: చంద్రబాబునగర్‌లో పరిస్థితి




సీతారామపురంలో నేలవాలిన వరి పంట


జలమయమైన ఆటోనగర్, తల్పగిరి కాలని ప్రాంతాలు


జలవనరులశాఖ కార్యాలయం వద్ద..


నెల్లూరు: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు



పెరుగుతున్న పంట నష్టం

41 గ్రామాల పరిధిలో 243.95 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. చేజర్ల, విడవలూరు, జలదంకి, అనంతసాగరం, సీతారామపురం, కలిగిరి మండలాల్లో కోతకు వచ్చిన వరిపంట దెబ్బతింది. మరో 8.8 హెక్టార్లలో నారుమడులు, 40 హెక్టార్లలో పొగాకు నారు దెబ్బతింది. కావలి, దగదర్తి, బోగోలు, పొదలకూరుల్లో 6.60 హెక్టార్లలో పూలు, కూరగాయలు, మిర్చి, పప్పు పంటలకు నష్టం వాటిల్లింది.


జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఆగిన తమిళనాడు బోట్లు


కందుకూరు-గుడ్లూరు రోడ్డులో ఎర్రవాగు ఉద్ధృతి

జలదంకి, కావలిలో అత్యధికం

బుధవారం వేకువజాము నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో సగటు 83.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 185 మి.మీ, కావలిలో 174.4 మి.మీ, నెల్లూరు నగరంలో 135.6, నెల్లూరు రూరల్‌లో 123.8 మి.మీ కురిసింది. ఎనిమిది మండలాల్లో 100 మి.మీ కంటే ఎక్కువ నమోదైంది. గడిచిన మూడు రోజుల్లో జిల్లాలో 226.7 మి.మీ. నమోదు కాగా.. అత్యధికంగా జలదంకి427.2 మి.మీ., కావలిలో 388 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం (మి.మీ)
జలదంకి	185
కావలి	174.4
నెల్లూరు రూరల్	123.8
కొండాపురం	108.2
తోటపల్లి గూడూరు	103.4
పొదలకూరు	103.2
కందుకూరు	102.8
ఇందుకూరుపేట	99.8
కోవూరు	99.2
లింగసముద్రం	97.6
సీతారామపురం	97.2
వరికుంటపాడు	95.6
వింజమూరు	92.8
సైదాపురం	88.2
ఉదయగిరి	87.8
గుడ్లూరు	85.2
వెంకటాచలం	80.8
కలిగిరి	80.2
ముత్తుకూరు	80.2
వలేటివారిపాలెం	77.6
కలువాయి	76.2
ఉలవపాడు	72.6
దగదర్తి	68.4
దుత్తలూరు	68.4
బుచ్చి	68.2
మనుబోలు	65.2
విడవలూరు	65.2
కొడవలూరు	64.6
రాపూరు	62.4
అనంతసాగరం	58.2
బోగోలు	51.6
అల్లూరు	50.2
సంగం	47.6
ఆత్మకూరు	44.6
చేజర్ల	38.4
ఏ.ఎస్.పేట	35.4
మర్రిపాడు	35.4


ఉలవపాడు మండలం బద్దిపూడి ఉప్పుటేరు వద్ద పోలీసు పహారా


నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి బోసు బొమ్మ మార్గంలో అండర్ బ్రిడ్జి వద్ద పాదచారుల అవస్థలు

అప్రమత్తతతోనే సమర్థ విధులు


విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: తుపాను తీరం దాటుతున్న సమయంలో విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ కె.సంతోషరావు సూచించారు. బుధవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. వాయుగుండం తీరం దాటనుందన్న హెచ్చరికల నేపథ్యంలో 120 బృందాలు, 674 మంది సిబ్బందిని సూళ్లూరుపేటకు పంపించినట్లు వెల్లడించారు. సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. స్తంభాలు పడిపోతే సంబంధిత అధికారులు, సిబ్బందికి, టోల్ ఫ్రీ నంబర్ 1912, 1800425155333, వాట్సాప్ నంబరు 91333 31912కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వి.విజయన్, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, సుధాకర్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, డీఈఈలు అశోక్, అల్తాఫ్, మునీంద్ర పాల్గొన్నారు.

కట్టకనే.. కన్నీళ్లు

కోసుకుపోతున్న 'సర్వేపల్లి' ఆనకట్ట

వెంకటాచలం, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారుల స్వార్థం.. ఇప్పటికే చేసిన పనుల్లో నాణ్యత లోపం.. వెరసి.. సర్వేపల్లి జలాశయం ఆనకట్ట మరోసారి కోసుకుపోతోంది. వైకాపా పాలనలో రూ. 11.10 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టినా.. ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత వర్షాలతో ఆనకట్ట కింద గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

పలుచోట్ల గోతులు

సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా- 1.74 టీఎంసీల సామర్థ్యం కలిగిన జలాశయంలోకి ప్రస్తుతం 1.2 టీఎంసీల నీరు చేరింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు.. ఆనకట్ట పటుత్వం కోల్పోయి కోసుకుపోతోంది. కొన్నిచోట్ల.. ఇది భారీగా ఉంది. రెండు, మూడు ప్రాంతాల్లో కట్ట మధ్యలో పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఆనకట్ట రోడ్డుపైనా గోతులు పడి.. ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచి.. అస్తవ్యస్తంగా తయారైంది. తూర్పు వైపు కట్ట పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.


ఆనకట్ట మధ్యలో గొయ్యి

అసంపూర్తి పనులతో...

వైకాపా పాలనలో జలాశయం ఆధునికీకరణ పనులు చేపట్టారు. సమయం పూర్తయి రెండేళ్లు గడిచినా.. 30 శాతం కూడా చేయలేదు. చేసినవీ.. బిల్లుల కోసమే అన్నట్లు సాగించడంతో.. ప్రస్తుతం రిజర్వాయరు కట్ట, రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. గత ఏడాది కురిసిన వర్షాలకే.. జలాశయం లోపలి వైపు కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. దాంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇప్పుడూ అలాంటి పరిస్థితే నెలకొంటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీరు పెరిగితే.. ప్రమాదం

విస్తారంగా వర్షాలు కురిస్తే.. నీరు చేరి ఆటుపోటుల కారణంగా కట్ట లోపలి వైపు కోసుకుపోయే ప్రమాదం ఉంది. గతంలోనూ మూడు సార్లు ఇలాంటి సంఘటనలే చోటు చేసుకున్నాయి. ఆధునికీకరణలో భాగంగా కట్ట తూర్పు వైపు ఆటుపోటుల గురయ్యే ప్రాంతంలో కట్ట దెబ్బతినకుండా.. రెండు కి.మీ. మేర కాంక్రీట్ రివిట్‌మెంట్ వేయాల్సి ఉండగా.. కేవలం 8 కి.మీ. చేసి వదిలేశారు. ఇప్పుడు అక్కడే సంక్లిష్టంగా తయారైంది. ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


కోతకు గురవుతున్న ఆనకట్ట

వర్షాలు ఆగిన తర్వాత..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కట్ట కొన్నిచోట్ల కోసుకుపోయింది. ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేయిస్తున్నాం. ఇప్పటికి రిజర్వాయరుకు ఎలాంటి ముప్పు లేదు. వర్షాలు ఆగిన తర్వాత.. పూర్తిస్థాయిలో పనులు చేపడతాం.
– వేమారెడ్డి, జలాశయం ఏఈ

పునాస.. అ'ధర'హో!

కందుకూరు, న్యూస్‌టుడే: పునాస మామిడికి మంచి ధర వచ్చింది. మార్కెట్‌లో టన్ను రూ. 55,000 ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇదే అధికమని చెమిడిదిపాడుకు చెందిన రైతు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం గుడ్లూరు నుంచి పునాస కాయలను నెల్లూరు, హైదరాబాద్‌కు తరలించారు. ధరలు బాగుండటంతో.. తోటల్లో కోతలు పెరిగాయి. ఈ ధర నిలకడగా ఉంటే.. లాభాలు వస్తాయని తోటల యజమానులు ఆశిస్తున్నారు.



తొలిరోజు రూ.6కోట్ల వ్యాపారం

వందకుపైగా ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం




నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీలో భాగంగా బుధవారం నుంచి జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 182 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించి, లాటరీ ద్వారా వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నూతన మద్యం దుకాణాలు తెరచుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచే ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా జరిగింది. 140 దుకాణాల వ్యాపారులు మద్యాన్ని కొనుగోలు చేశారు. మంగళ, బుధవారాల్లో జిల్లాలో రూ.6కోట్ల మద్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 182 దుకాణాలకు సంబంధించి 165 నెల్లూరులోని దేవరపాలెంలో గల ఐఎంఎల్ డిపోనకు, మిగతా 17 ఒంగోలు డిపోనకు కేటాయించారు. తొలిరోజు మద్యం పంపిణీని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు.

కొమ్మలేరు పొంగి.. జేసీబీ దిక్కయి

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అనంతసాగరం మండలం కొత్తపల్లి వద్ద కొమ్మలేరు వాగు పొంగడంతో.. కచిరదేవరాయపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని గంధం అనూష, గుత్తి మల్లేశ్వరి అనే గర్భిణులను వైద్యశాలకు తీసుకువెళ్లాల్సి రావడంతో.. రెవెన్యూ, వైద్య సిబ్బంది జేసీబీ సాయంతో వారిని వాగు దాటించి.. ఆపై 108 ద్వారా ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.


గర్భిణిని జేసీబీలోకి ఎక్కిస్తున్న వైద్య సిబ్బంది

కోనలో జలపాతం



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెంచలకోన కొండల్లో నుంచి బుధవారం జలపాతం కనువిందు చేస్తోంది. మబ్బులతో పాటు తేలికపాటి వర్షపు జల్లులు రావడంతో పెంచలకోన పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు చరవాణుల్లో బంధిస్తూ, స్వీయ చిత్రాలు దిగుతున్నారు. – న్యూస్‌టుడే, రాపూరు, వెంకటాచలం

రాళ్లపాడుకు జలకళ



లింగసముద్రం, న్యూస్‌టుడే: తుపాను కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు రాళ్లపాడు జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. బుధవారం రాత్రికి 13 అడుగుల మేర నీటిమట్టముంది. ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కులు వస్తోందని అధికారులు తెలిపారు. గురువారం ఉదయానికి నీటిమట్టం 15 అడుగులకు చేరవచ్చన్నారు. ప్రాజెక్టు వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉన్నట్లు జేఈ చంద్రమౌళి తెలిపారు.



పాత స్పిల్‌వే గేట్ల నుంచి లీకవుతున్న నీరు: ప్రాజెక్టుకు చెందిన పాత స్పిల్‌వేలోని 5, 8 గేట్ల నుంచి నీరు లీకవుతుంది. జలాశయంలో నీటి మట్టం పెరిగే కొద్ది లీకులు అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. వీటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పొర్లుకట్టను దాటిన ఇసుక దందా



పెన్నానది నుంచి పట్టపగలే ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నా కట్టడి చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోతోంది. బుధవారం సంగంలో ఈ వ్యవహారం విచ్చలవిడిగా సాగింది. పెన్నానదికి వరద ప్రవాహం వస్తుందనే అంచనాతో పొర్లుకట్టల స్థితిగతులను అధికారులు పరిశీలిస్తుంటే సంగంలో మాత్రం దాన్ని ధ్వంసం చేస్తూ ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ విషయమై కలెక్టరు, ఎస్పీ స్పందించి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంగం

మరో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో మరో 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మైపాడు సముద్ర తీరాన్ని, గంగపట్నం పునరావాస కేంద్రాలను పరిశీలించారు. కలెక్టరు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో కావలి, జలదంకి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదయిందన్నారు. మత్స్యకారులు చేపల వేటకు ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించి అన్ని వసతులు కల్పించామని చెప్పారు. ఎవరూ అధైర్యపడొద్దని, జనజీవనానికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో వాగులు, వంకలు వద్ద రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసు సిబ్బంది ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి విజయవాడకు రిజర్వేషన్ వసతి

నెల్లూరు(రవాణా): ఏపీఎస్‌ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలో నెల్లూరు- విజయవాడ సూపర్ లగ్జరీ సర్వీసులకు నెల్లూరు జోన్ ఈడీ జి.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. నెల్లూరు నుంచి విజయవాడకు ఉదయం 4, 5, 7:30 గంటలు, మధ్యాహ్నం 12:30, సాయంత్రం 4, 4:30 గంటలకు వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసుల్లో రిజర్వేషన్ వసతి ఉంటుందన్నారు. ఈ నెల 19 నుంచి నెల్లూరు-1 డిపోనకు చెందిన సూపర్ లగ్జరీ సర్వీసులు విజయవాడ నుంచి బయలుదేరేటపుడు ఉదయం 11:30, మధ్యాహ్నం 12:30, 3:30, రాత్రి 9గంటలు, అర్ధరాత్రి 12, 12:30 గంటలకు రిజర్వేషన్ వసతి కల్పించినట్లు వివరించారు.

పెళ్లి పత్రం
అన్నింటికీ అదే ప్రామాణికం
వేలల్లో వివాహాలు.. వందల్లో నమోదు

● నెల్లూరు నగరానికి చెందిన రామారావుకు ఇటీవల పెళ్లైంది. ఆయన కుటుంబ రేషన్ కార్డులో భార్య పేరు చేర్చాలని తలచారు. రెవెన్యూ కార్యాలయానికి వెళ్లగా.. వివాహ నమోదు ధ్రువపత్రం తీసుకురమ్మన్నారు. వెంటనే రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా వారు అడిగిన పత్రాలు తీసుకువచ్చేసరికి దాదాపు నెల రోజులు పట్టింది. వ్యయప్రయాసలతో ఎట్టకేలకు వివాహ నమోదు పత్రం తెచ్చుకున్నారు.

● జిల్లాకు చెందిన యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఇతర దేశంలో పనిచేస్తున్నారు. ఈ ఏడాది స్వగ్రామానికి వచ్చి పెళ్లి చేసుకున్నారు. భార్యను తనతోపాటు ఇతర దేశానికి తీసుకెళ్లాలంటే వివాహ ధ్రువపత్రం అవసరమని తలచి పెళ్లైన వెంటనే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి సకాలంలో తెచ్చుకున్నారు.





న్యూస్‌టుడే, నెల్లూరు(బృందావనం)

పెళ్లి ముహూర్తాల సమయంలో జిల్లాలో వేలాదిగా వివాహాలు జరుగుతుంటాయి. వివాహం చేసుకున్న ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరని ప్రభుత్వం చెబుతోంది. వివాహం తంతు పూర్తయిన తరువాత నూతన దంపతులు సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఆధారాలు చూపించి వివాహాన్ని చట్టపరంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదు ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయనే విషయం చాలా మందికి తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వేలల్లో పెళ్లిళ్ల జరుగుతుంటే.. వందల్లో నమోదవుతున్నాయి.

ఏడు కార్యాలయాలు

జిల్లాలో ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి కార్యాలయంలో ఇందుకు సంబంధించి ప్రత్యేక విభాగం ఉంది. ఇక్కడ ఉద్యోగులు ఉంటారు. నూతన దంపతులు అక్కడికెళ్లి ఆధారాలు సమర్పించి వివాహ ధ్రువపత్రాలు పొందొచ్చు.


దరఖాస్తుతో పాటు..

వివాహాల నమోదుకు వధూవరుల ఆధార్ కార్డులు, వయసు రుజువు పత్రాలు, పెళ్లి పత్రికలు, వివాహ సందర్భంలో తీసుకున్న ఫొటోలు, వివాహం జరిగిన దేవాలయం, కల్యాణ మండపం రసీదులు, వివాహానికి హాజరైన ముగ్గురు సాక్షులతో పాటు వారి ఆధార్ కార్డులు అవసరం. వీటన్నింటిని వివాహ దరఖాస్తుకు జతచేసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అందించాలి.

ఇవీ ఉపయోగాలు

దురదృష్టవశాత్తు భార్యాభర్తల్లో ఎవరు మరణించినా వారిరువురికి సంబంధించిన ఆస్తులు, ఉద్యోగాల ద్వారా లభించే అన్ని రకాల ప్రయోజనాలు పొందాలంటే వారు చట్టపరంగా భార్యాభర్తలు అని రుజువు చేసుకునేందుకు వివాహ నమోదు తప్పనిసరి. భార్యాభర్తలు విదేశాలకు వెళ్లాలన్నా.. రేషన్ కార్డులో పేరు చేర్చాలన్నా.. ధ్రువపత్రాలు అవసరం. ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.


జిల్లాలో వివాహాల నమోదు ఇలా..



రిజిస్ట్రేషన్ అయినవి

తల్లిదండ్రుల బాధ్యత

– వర్మ, జిల్లా రిజిస్ట్రార్, నెల్లూరు



తల్లిదండ్రులు వారి పిల్లలకు వివాహాలు ఎంత ఘనంగా జరిపించినా దగ్గరలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారి వివాహం నమోదు చేయించాల్సిన బాధ్యత వారిదే. పుట్టిన సమయంలో జనన ధ్రువపత్రం వలే వివాహ నమోదు ప్రాధాన్యం కలిగి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి. చట్టపరంగా వారి వివాహాన్ని నమోదు చేసుకోవాలి.

జగనన్న కాలనీల్లో వైకాపా నాయకుల దోపిడీ



కూలిన స్లాబ్‌ను చూపుతున్న సోమిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పేరుతో వైకాపా నాయకులు కోట్ల రూపాయలు దోపిడీ చేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వెంకటాచలంలోని జగనన్న కాలనీలో గిరిజనులకు నిర్మించిన గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. కొన్ని గృహాలకు ప్లాస్టింగ్ పరిశీలించగా రాలిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ... గిరిజనులను అడ్డుపెట్టుకుని వైకాపా నాయకులు నాసిరకంగా ఇళ్లు నిర్మించి రూ.కోట్లు దోచేశారన్నారు. తొమ్మిది అంగుళాలు నిర్మించాల్సిన పునాదులు, చుట్టూ గోడలు కేవలం నాలుగు అంగుళాలు నిర్మించడంపై ధ్వజమెత్తారు. పునాదులే దారుణంగా ఉన్నాయన్నారు. నాసిరకమైన కమ్మీలు వేయడంతో స్లాబ్ నిర్మాణాలు కూలుతున్నాయని మండిపడ్డారు. ఇంత జరిగినా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పూత పనులు చేయకుండానే పూర్తి నగదు తీసుకున్నారని చెప్పారు. లెవలింగ్ పేరుతో రూ.20.50 లక్షలు ఖర్చు చేశారని ఇక్కడ పరిశీలిస్తే పనులు చేసినట్లుగా కనిపించడం లేదన్నారు. అంతకు ముందు కసుమూరు గిరిజన కాలనీలో పర్యటించి స్థానికులకు టార్పలిన్ పట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

పశువులను వదలొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పశు సంరక్షణ జేడీ డాక్టర్ రమేష్

అనంతసాగరం, న్యూస్‌టుడే: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పశువుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంరక్షణ జేడీ డాక్టర్ రమేష్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రేవూరు పశువైద్యశాలను ఆయన పరిశీలించారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నందున వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని పశువులను వదలొద్దన్నారు. గొర్రెలు, మేకలు, గేదెలను విద్యుత్తు స్తంభాలకు, చెట్లకు కట్టొద్దన్నారు. పశువులు వ్యాధుల బారిన పడితే వెంటనే స్థానిక పశువైద్యాధికారులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన యానాదమ్మ
తొమ్మిది తులాల బంగారం, వెండి ఆభరణాల అప్పగింత



యానాదమ్మ పోలీసులకు అప్పగించిన బంగారు, వెండి ఆభరణాలు

మర్రిపాడు, న్యూస్‌టుడే: బస్సులో తొమ్మిది తులాల బంగారం, వెండి ఆభరణాలు వదిలేసి వెళ్లిన మహిళకు.. మర్రిపాడు మండలం ఇర్లపాడుకు చెందిన యానాదమ్మ వాటిని అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు. వివరాల మేరకు యనాదమ్మ హైదరాబాద్ నుంచి మర్రిపాడుకు ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో బుధవారం వస్తున్నారు. నంద్యాలకు చెందిన శైలజ అదే బస్సులో వస్తూ.. బ్యాగు మరిచిపోయి దిగారు. యానాదమ్మ తన పక్క సీట్లో బ్యాగును గుర్తించారు. 9 తులాల బంగారం, వెండి ఆభరణాలతోపాటు సదరు మహిళ వివరాలు ఉండడంతో చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు. వారు మర్రిపాడుకు వచ్చిన తరువాత పోలీసుల సమక్షంలో ఆభరణాలను అప్పగించారు. మానవత్వం చాటుకున్న యానాదమ్మను మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు, పలువురు అభినందించారు.

భవిత కేంద్రాలు, కేజీబీవీలకు నిధులు విడుదల

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: భవిత కేంద్రాలు, కేజీబీవీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. భవిత కేంద్రాల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల చిన్నారులకు రవాణా ఖర్చులకు, విద్యార్థులను కేంద్రాలకు తీసుకొస్తున్న సహాయకులకు, ఉపకారవేతనాలు, సిబ్బంది జీతాలకు రూ.73 లక్షలు విడుదల చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ల్యాబ్‌లు, గ్రంథాలయాల నిర్వహణకు, ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకు రూ.85 లక్షలు విడుదల చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విద్యార్థులకు జరుగుతున్న పలు కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఏపీసీ సీహెచ్ ఉషారాణి తెలిపారు.

అనుసంధానిస్తే.. కొలువుల జాతరే!
ప్రభుత్వ నిర్ణయంతో.. సరికొత్త ఆశలు

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అన్ని అవకాశాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానించేందుకు ముందడుగు వేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే.. ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి కొలువులకు కొదవుండదన్న అభిప్రాయం ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, వెంకటాచలం



జిల్లాలో మొత్తం ఐటీఐలు: 23
ప్రభుత్వం: 6 ప్రైవేటు: 17
మొత్తం విద్యార్థులు: 2,550
నిర్వహిస్తున్న కోర్సులు: 11

జిల్లాలో 23 ఐటీఐలు ఉండగా- వీటిల్లో సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, డీజిల్, మోటారు, ఏసీ, ఫ్రిజ్ మెకానిక్, ఫిట్టర్, వెల్డర్ తదితర కోర్సులు నిర్వహిస్తున్నారు. కొన్ని పరిశ్రమలతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నా.. విద్యార్థులు ఆశించిన మేర చేరడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మొదట ఐటీఐలపై దృష్టిసారించింది. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందేలా.. ఐటీఐలతో పరిశ్రమలను అనుసంధానం చేయాలని నిర్ణయించింది. అవసరమైతే.. ఆ మేరకు పాఠ్యాంశాల్లోనూ మార్పులు చేయనున్నారు. అందుకోసం ఐటీఐ అభివృద్ధి కమిటీల్లో ఛైర్మన్లుగా పరిశ్రమల యాజమాన్యాలను నియమించనున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ...

జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించడంతో పాటు, ఆయా పరిశ్రమల ప్రతినిధులు అతిథి అధ్యాపకులుగా వచ్చి విద్యార్థులకు బోధన, శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. ఆ మేరకు ఆయా కళాశాలల్లో అవసరమైన ప్రయోగశాలలపైనా ప్రభుత్వం దృష్టిసారించింది. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే.. మరో వైపు బీటెక్ చదువుకునే అంశంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉంది.

'జిల్లాలో కృష్ణపట్నం పోర్టుతో పాటు ఆయిల్ కర్మాగారాలు, పోర్టు, ఆక్వా అనుబంధ పరిశ్రమలు, ఆటోమొబైల్ షోరూంలు, ఇతర పరిశ్రమలు అధికం. ఇలా పారిశ్రామికంగా పురోగతి సాధించినా యువతకు ఆశించిన మేర ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. కారణం.. పరిశ్రమల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యం లేకపోవడమే.'

అనుసంధానంతో ఉపయుక్తం

– శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ ఐటీఐల కన్వీనరు

ఐటీఐ పూర్తి చేసిన వారికి నైపుణ్యం ఉంటే జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. చాలా మంది ఉపయోగించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలోని భార్గవి ఆటో మొబైల్స్, జేసీబీ, గ్రీన్‌టెక్, ఆయిల్ పరిశ్రమలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. పరిశ్రమల అనుసంధానంతో. . అవకాశాలు మరింత మెరుగవుతాయి. ప్రస్తుతం 11 కోర్సులు నిర్వహిస్తున్నాం. కొత్తగా డ్రోన్ టెక్నాలజీ కోర్సుల నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

వెబ్‌సైట్‌లో సచివాలయ ఏఎన్ఎం గ్రేడ్-3ల జాబితా

నెల్లూరు(వైద్యం): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఏఎన్ఎం గ్రేడ్-3 ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టును ఎంపీహెచ్ఏ(ఎఫ్) ప్రమోషన్‌కు జిల్లా వైబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో పెంచలయ్య తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు సరిచేసుకోవాలని వివరించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,383
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 59,064
వెండి గ్రాము :	రూ. 97.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	127
రిటైల్	149
లేయర్	120
బ్రాయిలర్స్	216
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	140
లేయర్	120
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	204

చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చాడనే కేసులో నేరం రుజువు కావడంతో పప్పులవీధి సప్తగిరి ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌కు చెందిన పాబోలు నాగభూషణానికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు.. రూ.9.15 లక్షలు పరిహారం ఫిర్యాదుదారుడికి చెల్లించాలని రెండో అదనపు న్యాయమూర్తి ఎల్.శారదారెడ్డి బుధవారం తీర్పుచెప్పారు. ఫిర్యాది తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు ఏసీ నగర్ సరస్వతీనగర్ ప్రాంతానికి చెందిన వీరేపల్లి పుల్లయ్య వద్ద అవసరం నిమిత్తం 2018 మార్చి 9న పాబోలు నాగభూషణం రూ.9.15 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోటు రాసిచ్చాడు. అప్పు చెల్లించే క్రమంలో 2019 సెప్టెంబర్ 4న రూ.9.15 లక్షలకు కొటక్ మహీంద్ర బ్యాంకు నెల్లూరు బ్రాంచి పేరిట చెక్కును ఫిర్యాదికి ఇచ్చాడు. అదేరోజు లక్ష్మీపురం ఎస్‌బీఐ బ్రాంచిలో తన ఖాతాలో జమచేయగా డబ్బు లేని కారణంగా తిరిగి వచ్చింది. దీంతో 2019 సెప్టెంబర్ 16న న్యాయవాది ద్వారా నోటీసు పంపి అనంతరం కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైంది.

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా, కె.ఏడుకొండలు జిల్లా కార్యదర్శిగా, శారద జిల్లా కోశాధికారిణిగా, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, గౌస్‌బాషా, సంయుక్త కార్యదర్శులుగా వరప్రసాద్, శ్రీనివాసాచారి, రామోహన్ రావు, రామలింగం, రామారావు ఎన్నికయ్యారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని బుధవారం స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి పక్కనే పెట్రోలు బంకు వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్దని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి ఎన్నికల సమయంలో తీసుకెళ్లారు. నూతనంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో అక్కడికి స్టాక్ తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకొని తలుపులు మూసి వేయించారు. సీఐ శ్రీనివాసులురెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివాదం జరగకుండా నిలువరించారు.



శాంతినగర్‌లో పోలీసులతో మాట్లాడుతున్న స్థానికులు

వర్షాకాలం చెరువులకు గండం

● జిల్లాలో 1761 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 2.81 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. వంద ఎకరాలకు పైబడి సాగు ఉన్నవి 725, అంతకులోబడి 979 చెరువులు ఉన్నాయి. ప్రధానంగా కావలి డివిజన్‌లో రైల్వే ట్రాక్ ప్రభావిత, గొలుసుకట్టు చెరువులు అధికంగా ఉన్నాయి.

● బోగోలు మండలంలో ప్రమాదకర స్థితిలో ఉన్న ఏడు కీలకమైన లింకు చెరువులకు ప్రపంచ బ్యాంకు రూ.6.35 కోట్లు 2018లోనే అప్పటి ప్రభుత్వం కేటాయించింది. మట్టి పనులు మాత్రమే చేశారు. వైకాపా ప్రభుత్వం రాగానే మిగతా పనులు గుత్తేదారులు నిలిపివేశారు. బిల్లులు రావన్న కారణంగా గుత్తేదారులు ముఖం చాటేశారు. ఫలితంగా చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. తొలగించిన రివిట్‌మెంట్ స్థానే కొత్తది ఏర్పాటు చేయలేదు. వరదలు వస్తే వీటి పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రమాదకర స్థితిలో జక్కేపల్లి గూడూరు చెరువు



కోతకు గురైన అక్కరాజువారి కండ్రిక చెరువు కట్ట

బిట్రగుంట, న్యూస్‌టుడే : కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, కుంటల్లోకి నీరు చేరుతోంది. భారీగా చేరితే చెరువులకు ప్రమాదం జరిగే పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. అయిదేళ్లుగా వైకాపా పాలనలో జిల్లాలో చెరువుల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో వీటి కట్టలు బలహీనంగా మారాయి. కంప చెట్లు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. ఈనేపథ్యంలో నీరు చేరితే కట్టలు తెగుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బాగానే ఉన్నాయి

కృష్ణమోహన్, ఎస్ఈ, ఇరిగేషన్

జిల్లాలో చెరువులన్నీ బాగానే ఉన్నాయి. వరదలు వస్తే కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. వచ్చే వేసవిలో చెరువుల ప్రగతికి ప్రాధాన్యం ఇస్తాం.

భద్రత గాలిలో దీపం

జిల్లాలో చెరువుల భద్రత గాలిలో దీపంలా మారింది. మూడేళ్లకోసారి జరగాల్సిన సాధారణ మరమ్మతులు గత వైకాపా పాలనలో చేపట్టలేదన్న విమర్శలున్నాయి. అత్యవసర పనులు కూడా మమ అనిపించడంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. కట్టలు బలహీనంగా తయారయ్యాయి. కర్ర తుమ్మ చెట్లు కమ్ముకుపోయాయి. కొన్ని చెరువులకైతే తూములు, షట్టర్లు శిథిలమయ్యాయి. రివిట్‌మెంట్‌కు కూడా మరమ్మతులు లేవు. ఆక్రమణలు మితిమీరిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. కలుజుల మట్టాలు తగ్గించినా ప్రశ్నించే వారు లేరు. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీనికి తోడు అనధికారిక ఆయకట్టు పెరుగుతోంది.

మన్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: మన్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి మన్నేరు ద్వారా రాళ్లపాడు జలాశయంలోకి నీరు చేరుతోందని ఈ క్రమంలో నీటిమట్టం పెరిగితే ఏ సమయంలోనైనా నీరు దిగువ ప్రాంతానికి విడుదల చేసే అవకాశముందన్నారు. అందువల్ల వాగులు, బ్రిడ్జిలు దాటే ప్రయత్నం చేయొద్దని ప్రజలను సూచించారు.

పునరావాస కేంద్రం కొనసాగింపు

కావలి, న్యూస్‌టుడే: వర్షాలు తగ్గే వరకు పట్టణంలో పునరావాస కేంద్రాలు ఉంటాయని ఆర్డీవో ఎం.వంశీకృష్ణ స్పష్టంచేశారు. బుధవారం 'ఈనాడు'లో 'పునరావాసం మమ' శీర్షిక ప్రచురితమైన కథనానికి స్పందించారు. మద్దిబట్టు గిరిజన కాలనీలో కేంద్రాన్ని పునరుద్ధరించారు. డాక్టర్ రమ్య నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు.

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

రాళ్లపాడు ప్రాజెక్టు సందర్శించిన సబ్ కలెక్టర్

లింగసముద్రం : రాళ్లపాడు జలాశయాన్ని కందుకూరు సబ్ కలెక్టర్ టి.శ్రీపూజ బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ సామర్థ్యంపై ఆరా తీశారు. గేట్లు ఎత్తితే ముంపునకు గురయ్యే గ్రామాల పరిస్థితిపై ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. జేఈ చంద్రమౌళి, రాళ్లపాడు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాకుమాను మాధవరావు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ


ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ దంపతులు

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం లోని చెంచులక్ష్మీపురం లోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ ఏర్పాటు మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ దంపతులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అర్చకులు వరాహచలం సౌయిరామాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ కార్యక్రమాలు నిర్వహించారు.

అభయాంజనేయ స్వామి విగ్రహం


పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

సీతారామపురం: గ్రామంలోని పడమటి వీధిలో రామాలయం వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మహేశ్‌శర్మ ఆధ్వర్యంలోని తొమ్మిది మంది రుత్విక్కులు ప్రతిష్ఠ నిర్వహించారు. విగ్రహం ఎదుట హోమం నిర్వహించి పూర్ణాహుతి చేపట్టారు. పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కుండపోత

పొంగిన వాగులు స్తంభించిన జనజీవనం


ఉలవపాడు: మన్నేటికోట తుపాను షెల్టర్‌లో తిరుపతిగుంట వాసులు


కావలిగ్రామీణం: ముంపులో అడవిరాజుపాలెం


జలదంకి: వాగుల దగ్గర పర్యవేక్షిస్తున్న ఎస్సై లతీఫున్నీసా

న్యూస్‌టుడే, కావలి, కావలి గ్రామీణం, కందుకూరు, ఉదయగిరి

వాయుగుండం ప్రభావంతో మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కుండపోతగా కురిసింది. వాగులు పొంగాయి. చెరువులకు నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ ముంపులో చిక్కుకున్నాయి. కావలిలో 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సిరిపురం, నారాయణపురం చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. పట్టణంలోని మద్దిచెట్టు గిరిజన కాలనీలో ఇళ్లు నీట మునిగాయి. అనపగుంత వద్ద తూము నిండుగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. చెరువుకట్టసంఘం, శివరామసుబ్బయ్యకాలనీ, ఆర్టీసీ వద్ద ఎస్సీకాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్డీవో వంశీకృష్ణ, నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోట్లూరి శ్రీనివాసులు, తదితరులు వివిధ ప్రాంతాలు సందర్శించారు. తుమ్మలపెంట వెళ్లే మార్గంలో గుమ్మడిబొందల సమీపంలో చప్టా వద్ద డీఎస్పీ శ్రీధర్, గ్రామీణ సీఐ రాజేశ్వరరావుతో కలిసి రాకపోకలను నియంత్రించారు. ఆములదిన్నె, తాళ్లపాలెం, తుమ్మలపెంట తదితర ప్రాంతాల్లో ఎంపీడీవో శ్రీదేవి పర్యటించారు. కావలి, జలదంకి ప్రాంతాల్లో భారీగా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

నిలిచిన రాకపోకలు

జలదంకి మండలంలో బ్రాహ్మణక్రాక, బిట్రగుంట ర.భ రోడ్డు లోలెవెల్ వంతెనపై చామదల సమీపంలో ఉప్పువాగు ఉద్ధృతంగా ప్రవహించింది. మండలంలోని కమ్మవారిపాలెంలో నేరేళ్ల వాగు నిండుగా ప్రవహిస్తుండడంతో గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. గోపనపాలెం వద్ద ర.భ రోడ్డుపైగా వరద పారడంతో జలదంకి నుంచి గట్టుపల్లి, అన్నవరం, గోపనపాలెం, తిమ్మసముద్రం, కేశవరం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వాగులను తహసీల్దార్ ప్రమీల, ఎస్సై సయ్యద్ లతీఫున్నీసా పరిశీలించారు. వాగులు దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. జమ్మలపాలెం గిరిజన కాలనీలోకి నీరు చేరడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపువాసులను తహసీల్దార్ ప్రమీల సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

గండిపాలెం జలాశయానికి నీరు

ఉదయగిరి : మండలంలోని గండిపాలెం ఎస్సీ కాలనీ వెళ్లే మార్గంలో రహదారికి అడ్డంగా చెట్టు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పిల్లాపేరు, దుస్సపోతుల వాగులు కొంతమేర ప్రవహిస్తున్నాయి. గండిపాలెం జలాశయానికి రెండు అడుగుల మేర నీరు చేరినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.


కావలి: మద్రిచెట్టు గిరిజన కాలనీలో


కలిగిరి: వెంకన్నపాలెం వాసులను పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచిస్తున్న అధికారులు


వరికుంటపాడు: పిల్లాపేరు వాగు వద్ద రాకపోకలు సాగించకుండా కంప వేయించిన ఎస్సై రఘునాథ్


కందుకూరు పట్టణం : మహదేవపురం అర్బన్ లేఅవుట్

కందుకూరులో జోరు వర్షం..

కందుకూరు పట్టణం : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కందుకూరు పట్టణం, నియోజకవర్గంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. బుధవారం ఉదయానికి ఎర్రవాగు ఉద్ధృతంగా ప్రవహించింది. కందుకూరు నుంచి గుడ్లూరు వెళ్లే రోడ్డులో ఎర్రవాగు చప్టాపై నీరు పారడంతో సబ్‌కలెక్టర్ టి. శ్రీపూజ, సీఐ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున రాకపోకలు నిలుపుదల చేయించారు. కందుకూరు నుంచి చుట్టుగుంట,గనిగుంట, ఆనందాపురం మార్గాల్లో రాకపోకలను నిలుపుదల చేయించారు. పట్టణంలోని ప్రశాంతికాలనీ, సుందరయ్యనగర్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. మున్సిపల్ అధికారులు కచ్చా కాలువలు తీయించి సమస్యలేకుండా చూశారు. ఏకలవ్య నగర్, గాయత్రినగర్, ఉప్పుచెరువు, కేసరగుంటకాలనీ, లుంబినీ వనం ప్రాంతాల్లో నీళ్లు నిలబడటంతో మున్సిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఏఎంసీ మార్కెట్‌యార్డు పక్కన, విప్పగుంటరోడ్డులో నివాశముంటున్న స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉప్పుటేరు చప్టాపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో బద్దిపూడి- మాచవరం వెళ్లే మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.


గుడ్లూరు :వంతెన తాకుతూ ప్రవహిస్తున్న ఉప్పుటేరు









వింజమూరులో నీట మునిగిన కంది.. జలదంకి: కేశవరం ఎస్సీ కాలనీలో.. కావలి: అనపగుంత వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు.. ఉదయగిరిలో గండిపాలెం మార్గంలో రోడ్డుపై వరద

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : చెన్నాయపాలెంలో విద్యుత్తు నియంత్రిక ఇటీవల కాలిపోయింది.
- షేక్ లతీఫ్, చెన్నాయపాలెం

సమాధానం : ఈ విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించాం. మరమ్మతులు చేపట్టాలని ఆదేశించాం - **చేజర్ల శ్రీనివాసులురెడ్డి, ఏఈ, ఎస్పీడీసీఎల్**
- న్యూస్‌టుడే, కావలి

వరద బాధితులకు ఆహారం అందజేత

కావలి, న్యూస్‌టుడే: వర్షాలతో నిరాశ్రయులైన పేద కుటుంబాలకు యువకులు మల్లి రాము, అభీసాగర్ సహాయం అందించారు. బుధవారం పట్టణంలోని దినసరి కార్మికుల నివాసాలకు వెళ్లి ఆహారం అందజేశారు. వైకుంఠపురం, చెరువుకట్ట సంఘం, పెదపవని రహదారికి ఇరువైపులా ఉన్న పేద కుటుంబాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలోని నిరాశ్రయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు బుధవారం మధ్యాహ్నం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. శారదానిలయం, ఏఎంసీ, ఏకలవ్యనగర్, ఉప్పుచెరువు, జనార్ధనకాలనీ, విప్పగుంటరోడ్డు ప్రాంతాల్లో 400 మందికి ఆహారం అందించినట్లు కమిషనర్ కె.అనూష తెలిపారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ: కాకర్ల

వింజమూరు, న్యూస్‌టుడే : పల్లెల్ని అభివృద్ధి చేసేందుకే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని కాటేపల్లి, రావిపాడు, వింజమూరు బీసీ కాలనీ, నందిగుంట గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కాటేపల్లిలో పంచాయతీ సిబ్బంది జీతాల బకాయిలపై సర్పంచి, కార్యదర్శి మధ్య తలెత్తిన వివాదాల గురించి మాట్లాడారు. రావిపాడులో పీఆర్ ఎస్ఈ పి.అశోక్‌కుమార్, అధికారులతో రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు నమోదు తప్పనిసరి

వరికుంటపాడు : శనగ విత్తనాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి వి.రవికుమార్ బుధవారం తెలిపారు. విరువూరులో వ్యవసాయ సహాయకులు శారద నమోదు చేయించుకున్నారు. వలేటివారిపాలెం : రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసే రైతులకు 25 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అవసరమైన అన్నదాతలు ఈ నెల 30వ తేదీ లోపు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు నిలువరింత


యూనియన్ రోడ్డులో ఆందోళన చేస్తున్న స్థానికులు

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు యత్నాన్ని బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వారు ఆనకట్ట సమీపంలో ఏర్పాటుకు కంప చెట్లు తొలగిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో గది అద్దెకు ఇచ్చిన యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

యూనియన్ రోడ్డులో..

మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ యూనియన్ రోడ్డులో స్థానికులు ఆందోళన చేశారు. దుకాణం ఏర్పాటుకు గది అద్దెకు తీసుకొని సిద్ధం చేసినట్లు స్థానికులకు సమాచారమందడంతో నిరసనకు దిగారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆ ప్రాంత వాసులు బుధవారం రాత్రి స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాన్ని తొలగించకపోతే సహించేది లేదన్నారు. సీఐ లక్ష్మణస్వామికి నతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు జి.శ్రీనివాసులు, ఇలియాజ్, కరీం, బాబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న బాలాజీనగర్ ప్రజలు

ముప్పు తప్పించారు

బిట్రగుంట, న్యూస్‌టుడే బోగోలు మండలం ముంగమూరుతోటలు సమీపంలో బుధవారం పిల్లి వాగు వంతెనకు ఏర్పడిన ముప్పును అధికారులు, తెదేపా నాయకులు తప్పించారు. జలదంకి, బోగోలు మండలాల వరద నీరు ఈ వాగులో ప్రవహిస్తోంది. తాటి, టెంకాయ చెట్ల మొద్దులు, కంప కర్ర వ్యర్థాలు తూములకు అడ్డు పడడంతో నీరు నిలిచింది. ఇది పొంగితే సమీప ప్రాంతాలు మునకకు గురవుతాయి. దీన్ని గమనించిన తెదేపా నాయకులు ఎం.నాగేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు అధికారులకు తెలిపారు. తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం, ఎస్సై భోజ్యానాయక్, వివిధ శాఖల ఇంజినీర్ల పర్యవేక్షణలో అడ్డంకులను తొలగించి వరద ముప్పు తప్పించారు.

ముంపు వాసుల తరలింపు

కలిగిరి : వర్షాలకు మండలంలోని చెరువుల్లో జలకళ సంతరించుకుంది. 48 చెరువులు ఉండగా వాటిల్లోకి బుధవారం సాయంత్రానికి 30 నుంచి 50 శాతం నీరు చేరింది. వెంకన్నపాలెం ఎస్టీకాలనీలోకి నీరు చేరింది. తహసీల్దారు రవీంద్రబాబు, ఎంపీడీవో ప్రత్యూష, పంచాయతీ సిబ్బంది వెళ్లి సమీపంలోని పాఠశాలకు వారిని తరలించారు. కుడుములదిన్నెపాడు సమీపంలోని మిడతవాగులో నీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డంకులను ఎస్సై ఉమాశంకర్ తొలగింపజేశారు.

6 గంటల్లో విద్యుత్తు పునరుద్ధరణ

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలంలోని వడ్డిపాళెం-తెల్లగుంట మధ్య విద్యుత్తు స్తంభం పడిపోగా ఆరు గంటల్లో సరిచేశారు. ఏఈ జడరాయి గ్రామస్థుల సహకారంతో పడిన స్తంభాన్ని నిలబెట్టడంతో పాటు అడ్డంకిగా తయారైన చెట్ల కొమ్మల్ని తొలగించి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు.

సర్పంచి చొరవ - తప్పిన వరద ముప్పు

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని చవటపుత్తేడు సర్పంచి పులి శీనయ్య చొరవతో పిల్లి వాగు వరద ముంపు ప్రమాదం తప్పింది. చప్టా వద్ద తూములకు అడ్డంగా జమ్ము, తాటిమానులు పడిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీన్ని గుర్తించిన సర్పంచి శీనయ్య రైతులతో కలసి జమ్ము, తాటిమానులు తొలగించారు. పొలాలు, కాలనీలకు వరద ప్రమాదం తప్పింది.

రక్షక భటులకేదీ రక్షణ?


పెచ్చులూడిన పోలీస్‌స్టేషన్ భవనం పైకప్పు

మండలంలోని ప్రజలు ఏ సమస్య వచ్చినా పరుగున వస్తారు. బాధలు చెప్పుకుంటే పరిష్కరిస్తారు. ఈ సమస్యలు తీర్చే వారికే పెద్ద కష్టం వచ్చింది. కాలం తీరిన భవనంలో దినదినగండంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏక్షణం కూలిపోతుందోనని హడలిపోతున్నారు. తరచూ పైకప్పు పెచ్చులు రాలిపడుతున్నాయి. ఉన్నతాధికారులకు చెప్పినా దీనికి మోక్షం కలగలేదు. ఇదీ కలిగిరి పోలీసుల కథ

న్యూస్‌టుడే, కలిగిరి

గ్రామంలో 1969లో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించారు. 55 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడిపోవడంతో గదులన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి. వర్షం కురిస్తే దస్త్రాలు కాపాడుకోవడం వీరికి పెద్ద సాహసంగా మారింది. గోడలు పగుళ్లిచ్చాయి. ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో పలుమార్లు పోలీసులే సొంతంగా మరమ్మతులు చేయించారు. టైల్స్ వేయించారు. భారీ వర్షాల సమయంలో లోతట్టుగా ఉన్న స్టేషన్‌లోకి నీరు చేరుతుంది.


భవనం ఉరుస్తుండడంతో నీరు పడేందుకు ఏర్పాటుచేసిన డబ్బాలు

గోడలకూ కరెంటు సరఫరా..

వర్షాల సమయంలో ఒక్కోసారి గోడలకు కరెంటు సరఫరా అవుతోంది. పట్టుకుంటే జిల్ మంటున్నాయి. గోడలు వర్షాలకు బాగా నెమ్ముగా ఉండడంతో ఆ గోడల్లోని వైర్ల నుంచి సరఫరా అవుతోంది.

అద్దె భవనంలో సర్కిల్ కార్యాలయం

1993 నుంచి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఉంది. కలిగిరి, కొండాపురం, వింజమూరు, జలదంకి మండలాలు దీని పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వ భవనం లేకపోవడంతో 31 ఏళ్లుగా అద్దె ఇంట్లో కొనసాగుతుంది. 20 ఏళ్ల కిందట కలిగిరిలో సర్కిల్ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించగా పునాదుల దశలో ఆగిపోయింది.

స్థల పరిశీలనతో సరి

కలిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు స్థానికంగా వసతిగృహ నిర్మాణ సముదాయం (క్వార్టర్స్), పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయం నిర్మాణానికి 2021లో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మండల వాసి మెట్టుకూరి చిరంజీవిరెడ్డి ఉండగా సదుపాయాలు కల్పించేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. గతంలో పోలీస్‌క్వార్టర్స్‌కు జిర్రావారిపాలెంలో కేటాయించిన స్థలాన్ని, కలిగిరిలో శిథిలమైన పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. వీలైనంత త్వరలో సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నిర్మాణాలు చేస్తామని చెప్పిన అధికారుల మాటలు నెరవేరలేదు.

ఇదీ పరిస్థితి

బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో దస్త్రాలను రాస్తుండగా ఒక్కసారిగా పైకప్పు పెచ్చులూడిపడింది. పక్కన పడడంతో సిబ్బందికి ప్రమాదం తప్పింది. ఇలా తరచూ జరుగుతోంది. జీపు మూలకు చేరి రెండేళ్లు అవుతోంది. సొంత వాహనాల్లోనే బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవస్థలు పడుతున్నారు.

సమాచారం ఇచ్చాం: ఉమాశంకర్, ఎస్సై

భవన దుస్థితిపై అధికారులకు సమాచారం ఇచ్చాం. వర్షాల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. భవనం ప్రమాదకరంగా ఉంది.

అమ్మో.. కొండచిలువ



సంగం, న్యూస్‌టుడే: సంగంలో బస్టాండు కూడలి సమీపంలోని దువ్వూరు కాలువ వంతెనపై మంగళవారం రాత్రి కొండచిలువ సంచరించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొద్దిరోజుల క్రితం దువ్వూరు కాలువపై బండారుమిట్ట కూడలి సమీపంలోని వంతెనపై కొండచిలువ కనిపించింది. తిరిగి ఇప్పుడు రెండోసారి కనిపించడంతో అది ఇది ఒకటేనా మరొకటా అని భయపడుతున్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

రాయితీపై వరి విత్తనాలు

కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం : వరివిత్తనాలు కిలో రూ.5 రాయితీపై అందిస్తున్నట్లు ఏవో లక్ష్మి తెలిపారు. కొడవలూరు మండలం యల్లాయపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204, కేఎన్‌ఎమ్ 1638 రకాలు అందుబాటులో ఉన్నాయని రైతులు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు సురేష్ మాట్లాడుతూ మినిగోకులాలు, పశువులకు వ్యాక్సినేషన్ గురించి వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: కోవూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఎదురుగా పాటూరు రోడ్డులో మురుగు కాలువలో వ్యర్థాలు వేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీరు పారడం లేదు. **- రమేశ్, కోవూరు**

సమాధానం: సిబ్బందిని పంపించి కాలువల్లో వ్యర్థాలు శుభ్రం చేయిస్తాం.

- శివకుమార్, ఈవో, కోవూరు

? కోవూరు పట్టణంలోని మైథిలీహాల్ పక్క వీధిలో సెయింట్ పాల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే సిమెంటు రోడ్డు ధ్వంసమైంది. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. **- కావ్యశ్రీ, కోవూరు**

✔ త్వరలో నూతన రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శివకుమార్, ఈవో, కోవూరు

వీడని వర్షం.. జలదిగ్బంధం



కొలనుకుదురులో గిరిజనులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎస్సై రాకేశ్



తలమంచి వద్ద కల్వర్టు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం



ఆత్మకూరు:నల్లపురెడ్డిపల్లి – బట్టేపాడు మార్గంలో ముంపునకు గురైన పొలాలు



చెన్నారెడ్డిపల్లి గిరిజన కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్



కమ్మవారిపల్లి చప్టాను సందర్శించిన డీఎస్పీ వేణు గోపాల్

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు బృందం, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. వాగులు పొంగడంతో పలు ప్రాంతాల్లో జలదిగ్బంధం నెలకొంది. బుచ్చి, కొడవలూరు మండలాల్లో భారీ వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కొడవలూరు మండలంలోని తలమంచిలో కల్వర్టు వద్ద గండి పడి రాకపోకలకు విఘాతం ఏర్పడింది. బుచ్చిరెడ్డిపాళెం పల్లాపల్లిలో స్థానికంగా ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో తెదేపా నాయకులు ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం ఏర్పాటుచేశారు. ● సైదాపురం మండలం ఊటుకూరు, తురిమెర్ల సమీపంలోని పిన్నేరు, మాలేరు వాగులను అధికారులు పరిశీలించారు. పాలూరు గిరిజన కాలనీలో పూడిగుడిసెల్లో ఉంటున్న గిరిజనులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ● పొదలకూరు మండలంలోని చెన్నారెడ్డిపల్లి, గిరిజన కాలనీ వాసులను పిలిచి సురక్షిత ప్రాంతానికి రావాలని ఎస్సై హనీఫ్ అధికారులకు సూచించారు. హరిజనవాడ వద్ద వర్షపు నీరు వెళ్లే మార్గం పూడిపోవడంతో యంత్రాలతో శుభ్రం చేయించారు. ● విడవలూరు మండలంలోని గాదిలదిన్నె వద్ద పైడేరు వాగు కట్టకు వర్షాలకు దెబ్బతింది. గ్రామస్థులు అధికారులకు సమాచారమివ్వగా అప్రమత్తమై గండిని పూడ్చారు. ● వెంకటాచలం మండలం తిరుమలమ్మపాళెం వద్ద ఉప్పు కాలువ వంతెనపై కొద్దిగా నీరు ప్రవహిస్తోంది. ముత్తుకూరు మండలం నేలటూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని నెల్లూరు ఆర్డీవో పరిశీలించారు. ● కోవూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వర్షానికి పంట కాలువలు నిండి రోడ్డుపై నీరు చేరింది. ● మనుబోలు మండలంలోని కొలనుకుదురులోని గిరిజనులకు ఎస్సై రాకేశ్ బియ్యం అందజేశారు. వారిని తుపాను రక్షిత భవనం వద్దకు తరలించారు. బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలోని సంగమేశ్వర గిరిజనకాలనీలో అధికారులు పర్యటించారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. లక్ష్మీనరసింహపురంలోని 60 మంది గిరిజనులను పునరావాస కేంద్రానికి తరలించి భోజనంతోపాటు పాలు పంపిణీ చేశారు. ● మర్రిపాడు మండలం చుంచులూరు, పీఎన్‌పల్లి వద్ద ఉన్న కేతామన్నేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఆత్మకూరు పట్టణం, రూరల్ మండలంలో పంట పొలాలు ముంపునకు గురికావడంతో చెరువులను తలపించాయి. బొగ్గేరులో స్వల్పంగా ప్రవాహం వచ్చింది. ●సోమశిల జలాశయాన్ని ఆత్మకూరు డీఎస్పీ వేణు గోపాల్ పరిశీలించారు. కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద పొలాల్లో నుంచి రోడ్డుపైకి వచ్చిన నీటి ప్రవాహాన్ని చూసి సిబ్బందితో మాట్లాడారు. ● మండలంలోని పలు గ్రామాల్లో 350 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందని ఏవో శ్రీధర్ రెడ్డి తెలిపారు. కొత్తపల్లి, కచిరదేవరాయపల్లి, వడ్డిపాలెం, పాతదేవరాయపల్లి గ్రామాల్లో నీట మునిగిన పొలాలను పరిశీలించారు.● ఆత్మకూరు ఆర్డీవో పావని చేజర్లలోని స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులోని ప్రజలను పరామర్శించారు. ●ఏఎస్‌పేట మండలంలోని కొండమీద కొండూరు గ్రామం వద్ద బీరాపేరు వాగు వంతెనను ఎంపీడీవో ప్రసన్నకుమారి పరిశీలించారు. ● విడవలూరు మండలంలోని పొన్నపూడి ఎస్టీ కాలనీలో వర్షపు నీరు చేరడంతో గిరిజనులు అవస్థలు పడుతుండంతో తెదేపా నాయకులు వాసు, అధికారులతో కలిసి ఆహారం పంపిణీ చేశారు. వారిని సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు.



విడవలూరు మండలం గాదెలదిన్నె వద్ద పైడేరు కట్టకు గండి





చలపనాయుడుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీవో పావని.. నేలటూరు పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న నెల్లూరు ఆర్డీవో నాగ సంతోషి



వెంకటాచలం సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు



లక్ష్మీనరసింహపురంలో గిరిజనులకు పాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పెట్రోలులో నీరు కలిసిందని వాహనదారుల ఆందోళన

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఒక పెట్రోలు బంకు వద్ద ఇంధనం పోయించుకున్న పలువురు కార్లు, ద్విచక్రవాహనాలు మొరాయించిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వారు సమీపంలోని మెకానిక్‌ల వద్దకు వెళితే వాహనాలు పరిశీలించి ట్యాంకులో పెట్రోలుతో పాటు నీరు ఎక్కువగా ఉందని చెప్పడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు పెట్రోల్ బంకు సిబ్బందిని ప్రశ్నించగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇలా జరిగిందని చెప్పడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పెట్రోల్ బంకులను తనిఖీ చేయకపోవడంతోనే ఇలా చేస్తున్నారని పలువురు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వాటిని తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రామాలయం వెనుక ఉన్న జగనన్న లేఅవుట్‌లో వర్షపు నీరు నిలిచింది. బుధవారం పొక్లెయిన్‌తో అక్కడికి వెళ్లి వర్షపు నీరు బయటకెళ్లేలా చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారంతా స్థానికంగా ఏర్పాటుచేసిన సురక్షిత కేంద్రాలకు వెళ్లాలని కోరారు. రామాలయం ఎదుట గోడ కూలడంతో వెంటనే తొలగించారు.



కనుపూరు వంతెనపై నీటి ప్రవాహం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లు కనిపించకుండా నీరు ప్రవహిస్తోంది. పొదలకూరు- సంగం మార్గంలోని వరదాపురం సమీపంలో కనుపూరు కాలువ వంతెనపై వర్షపునీరు చేరడంతో వాహనాల రాకపోకలకు కొంత సేపు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ర.భ శాఖ అధికారులు మాట్లాడుతూ రోడ్డు కుంగడంతో నీరు నిలిచాయన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

రైల్వే యార్డులో దిగుమతులు

కోవూరు సమీపంలోని పడుగుపాడు రైల్వే యార్డులో బుధవారం భారీ వర్షంలో కార్మికులు గూడ్సు ద్వారా వచ్చిన సామగ్రిని మూడు క్రేన్ల సహకారంతో దిగుమతి చేశారు. యార్డులోకి వచ్చిన లారీల ద్వారా గూడ్సులోని సామగ్రిని చెన్నై, విజయవాడ వైపునకు తరలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యార్డు వద్ద గుంతల్లో నీరు చేరింది. ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బందులు లేవని రైల్వే అధికారులు తెలిపారు.– న్యూస్‌టుడే, కోవూరు, కొడవలూరు





పొంచి ఉన్న ప్రమాదం

విరువూరు నుంచి సూరాయపాళెం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో గుంత ప్రమాదకరంగా ఉంది. వినాయకుడి ఆలయ సమీపంలో పెన్నానది నుంచి విరువూరు ఏటి కాలువ ఈ మార్గం మీదుగా ప్రవహిస్తోంది. ఇటీవల ఇసుక రీచ్ ఏర్పాటు చేయగా భారీవాహనాలతో గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

మడుగులు కాదు.. దారులే..!

చినుకుపడితే చాలు మండల కేంద్రమైన మర్రిపాడులోని రహదారులు నడవడానికి వీల్లేని విధంగా తయారవుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీధులు మడుగులను తలపిస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతామని ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్ తెలిపారు.
– న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)



రెండు గ్రామాలకు పడవల తరలింపు

సంగం, న్యూస్‌టుడే: మండలంలో వరద సహాయ చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. పెన్నానది, బొగ్గేరు వరద ప్రవాహాలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యే కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాల నుంచి ప్రజలను రక్షిత ప్రాంతాలకు, పునరావాస శిబిరాలకు తరలించేందుకు వీలుగా నాలుగు పడవులను రెండేసి చొప్పున ఆయా గ్రామాలకు చేర్చారు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చందలూరుపాడు సమీపాన ఉన్న బీరాపేరువాగు, వడుసువాగును, తెల్లపాడు సమీపాన ఉన్న అలుగువాగు, గుడిపాడు వద్ద ఉన్న బీరాపేరు వాగులను తహసీల్దారు శ్రీరామకృష్ణ, ఎస్సై సైదులు పరిశీలించారు. వాగుల్లో వచ్చే వరద ఉద్ధృతిని తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాలిక అదృశ్యం


సంగం, న్యూస్‌టుడే: మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు సంగం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మంగళవారం నుంచి కనపడటం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన పెనుప్రమాదం

దువ్వూరు(సంగం), న్యూస్‌టుడే: దువ్వూరు గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఒక గొర్రె మృతి చెందడంతో పెనుప్రమాదం తప్పింది. మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన ఎర్త్ తీగ నుంచి విద్యుత్తు సరఫరా జరిగింది. దాంతో అక్కడే సంచరించే గొర్రె దానికి తగలడంతో విద్యుదాఘాతంతో మృతి చెందింది. పాఠశాలకు సెలవు కావడంతో అదృష్టవశాత్తు విద్యార్థులు ఆ ప్రాంతానికి వెళ్లలేదు. వెంటనే అక్కడ తిరిగి ప్రమాదాలు జరగకుండా డిస్కం సిబ్బంది చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట

ముత్తుకూరు, న్యూస్‌టుడే: అదాని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ద్వారా నైపుణ్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆ సంస్థ సీఈవో జితిన్ త్రివేది తెలిపారు. పోర్టు సీఈవో జగదీశ్ పటేల్‌తో కలిసి పోర్టు సంబంధిత కోర్సులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... పోర్టు, లాజిస్టిక్స్ రంగాలు ప్రస్తుతం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఆ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చి వారికి నైపుణ్యావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీవోవో రాజన్ బాబు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జితిన్ త్రివేది

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మనుబోలు, వెంకటాచలం, న్యూస్‌టుడే: వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. .. ఆర్టీసీ బస్సు, ట్రక్కు వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మనుబోలు మండలం కొమ్మలపూడి అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. గూడూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరుకు వెళుతోంది. కొండూరుసత్రం వద్ద నుంచి వాహనాలను ఒకవైపే మళ్లించారు. నెల్లూరు నుంచి చిత్తూరు వెళుతున్న ట్రక్కు ఆటో, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ట్రక్కు వాహనం డ్రైవర్ శ్రీనాథ్ చిక్కుకున్నారు. బయటకు తీసి నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. ● రహదారిపై వెళుతున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలంలో జరిగింది. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ కసుమూరు రోడ్డు వద్ద డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేశారు. వెనుక వస్తున్న మూడు కార్లు, రెండు ఆటోలు, ద్విచక్రవాహనం ఒకదానికొకటి అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, చేజర్ల

అన్నదాతల గోడు వినేదెవరు?

వానాకాలంలో ఆకాశంలో మబ్బులేచిందంటే మండలంలోని ఆరు గ్రామాల రైతులు పరుగుపరుగున ఇల్లు చేరాల్సిందే. లేదంటే గట్లపై ఉండే ఏ చెట్టునో, గొడుగు నీడనో జాగారం చేయాల్సిందే. కాదని ఇల్లు చేరాలంటే పొలాల గట్లపై పది నుంచి పాతిక కిలోమీటర్ల దూరం ప్రయాణించి పొదలకూరు- సోమశిల రహదారి మార్గంలో ఎత్తు వంతెన మీదగా చేరాలి. చేజర్ల మండలం మధ్యలో ప్రవహించే నల్లవాగు కారణంగా ప్రజలు పడే ఇబ్బందులివి. వానలు, వరదలొస్తే రోజుల తరబడి పంటను చూసుకునేందుకు దారిలేదు. చేజర్ల, మడపల్లి, తూర్పుకంభంపాడు, ఎనమదల, నాగులవెల్లటూరు బిల్లుపాడు గ్రామాల ప్రజలు వాగుకు ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయి. రెండు మండలాల్లో 40 కిలోమీటర్ల నిడివిలో ఉన్న ఈ వాగుకు వర్షాకాలంలో కాలువలు, చెరువుల్లోని మిగులు నీరు చేరుతోంది. చిన్న జల్లు కురిసినా భారీగా నీటి ప్రవాహం వస్తోంది. చేజర్ల- కలువాయి రహదారికి ఈ వాగు అడ్డంగా ఉంటుంది. దీనిపై ఎత్తు వంతెన నిర్మించాలని నాలుగు దశాబ్దాలుగా స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఎన్నికల ప్రచారంలో ఈ వంతెన హామీ ఉంటుంది. అయినా ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. నల్లవాగు ఉన్న ప్రతి గ్రామానికి పొలాలకు మధ్యలో వాగుపై వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మడపల్లి- తూర్పుకంభంపాడు మధ్య నల్లవాగు ఉద్ధృతి

నిత్యావసరాలు అందించండి

కోవూరు : మండలంలో నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే 20 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసి ఆదుకోవాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బుజ్జయ్య అన్నారు. సీపీఎం నాయకులు బుధవారం తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం అందించారు.

మైనార్టీ నాయకుడి మృతికి నివాళి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి నగర పంచాయతీలోని ఖాజానగర్‌కు చెందిన తెదేపా మైనార్టీ నాయకులు సయ్యద్ సమీవుల్లా(65) అలియాస్ బచ్చేభాయ్ గుండెపోటుతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు నివాళులర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మృతుడి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల పలువురు మృతి చెందగా.. వారి కుటుంబాలకు సాంబశివా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఒకటో వార్డులో పెద్దనరసయ్య, దొరసానమ్మ, 12వవార్డులో పెంచలయ్య, 15వ వార్డులో నాగేంద్ర ఇటీవల మృతి చెందారు. ట్రస్ట్ సభ్యులు వీరి కుటుంబాలను పరామర్శించి రూ.10వేలు చొప్పున రూ.40వేలు ఆర్థికసాయం అందజేశారు

బాధితులకు సరకుల పంపిణీ

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పున్నూరు గ్రామం రాణా ప్రతాప్‌సింగ్ గిరిజన కాలనీలో విద్యుదాఘాతానికి మాణిక్యాల బంగారయ్య పూరిగుడిసె దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తెదేపా నాయకుడు చెంచుకిషోర్, నాయకులు కలిసి బాధితులకు రూ.5 వేల నగదు, 25 కేజీల బియ్యం, దుస్తులు అందజేశారు.

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నెల్లూరు నగరంలోని వెంకటరెడ్డినగర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు రోడ్డును తవ్వి గుంతలు పూడ్చకుండా వదిలేశారు. చెత్త బండి ఎనిమిది రోజులకోసారి రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - విజయమ్మ

సమాధానం: సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. - సూర్యతేజ, కమిషనర్

? హరనాథపురం రెండో వీధిలో కాలువలు పూడికతో నిండిపోయి.. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. - శ్రీనివాసులు

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? పాత మున్సిపల్ రోడ్డులో కాలువల్లో పూడిక తీసి రోడ్డుపై వేశారు. వాటిని తొలగించలేదు. - శ్రీనివాసులు

✓ పూడిక మట్టిని తరలిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? నార్త్ మాగుంట లేఅవుట్ నాలుగో వీధి మధ్యలో చిన్నకుంట మార్గం పెద్దది ఏర్పాటు చేశారు. వీధులు మార్కి వీధిదీపం అమర్చలేదు. ఎలెన్3/బి1/1 స్తంభం వద్ద 20 రోజులుగా చీకటిగా మారింది. - డాక్టర్ పీవల్ నరసింహారావు

✓ దీపం ఏర్పాటు చేయిస్తాం. - సూర్యతేజ, కమిషనర్

- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

విద్యతో ఉన్నత శిఖరాలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విక్రమ సింహపురి వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని వియాని హోమ్‌లో విద్యార్థులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వర్సిటీ వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయశంకర్ అల్లం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.





అయ్యప్పగుడి సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు.. రంగనాయకులపేట గేటు వద్ద ఆగిన వాహనాలు.. సండే మార్కెట్ దారులు మూసివేత

ముంచెత్తిన వాన

నెల్లూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నెల్లూరు నగరంతోపాటు రూరల్ మండలంపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇరుగాళ్లమ్మ దేవాలయం నుంచి జొన్నవాడ వెళ్లే మార్గంలో పొట్టేపాళెం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న హార్వింగ్ పడిపోయింది. పొట్టేపాళెం కలుజుపై నీరు ప్రవహిస్తుండటంతో పెద్దవాహనాలే వెళుతున్నాయి. చిన్న వాహనాలు పక్కనే ఉన్న మట్టి కట్టపై రాకపోకలు సాగిస్తున్నాయి. ములుమూడి చెరువు కలుజు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. కలుజుల వద్ద రోడ్లు దెబ్బతిని ఉన్నాయి. ముత్తుకూరు రోడ్డులో పలుచోట్ల గుంతలు పడ్డాయి. అంబాపురం, కొండ్లపూడి తదితర ప్రాంతాల్లో ఉన్న జగనన్న లేఅవుట్‌లలో నీరు నిలిచింది.



పొట్టేపాళెం కలుజు సమీపంలో రోడ్డు దుస్థితి

కాలనీల్లో ముంపు సమస్య

నెల్లూరు(నగరపాలకసంస్థ) : నగరంలోని ఆర్టీసీ, తల్పగిరి, రెవెన్యూ, పోలీసు కాలనీలు, చంద్రబాబునగర్, శ్రామికనగర్, మనుమసిద్ధినగర్, సాయినగర్ తదితర ప్రాంతాలను వర్షపునీరు ముంచెత్తుతోంది. భారీగా వరద చేరి చెరువులను తలపిస్తోంది. ఏటా ఇక్కడ ఇదేతంతు. కాలువలు నిర్మించకపోవడంతో నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఆర్టీసీ బస్టాండులో..

నెల్లూరు (రవాణా) : నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో వర్షపు నీరు చేరింది. నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్లే నాన్‌స్టాప్ సర్వీసులు నిలిచే చోట ప్లాట్‌ఫారం వద్ద నీరు నిల్వ ఉంది. పొట్టి శ్రీరాములు బస్టాండులో అక్కడక్కడ నీరు నిలిచింది. వర్షం కారణంగా ప్రయాణికులు తక్కువగా ఉన్న మార్గాలలో ఆయా ప్రాంత పరిస్థితులను బట్టి బస్సులను తగ్గించే అవకాశం ఉన్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎం.మురళి బాబు తెలిపారు.

ప్రయాణికుల వెతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షపునీరు పెద్దఎత్తున చేరింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు కొన్ని సీటులో నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పాదచారులు గోడలు పట్టుకుని ప్రమాదకరంగా వెళుతున్నారు. ఇదే పరిస్థితి విజయమహల్‌గేటు, రామలింగాపురం అండర్ బ్రిడ్జిల వద్ద నెలకొంది. దీంతో ఎక్కువ మంది వాహనదారులు రంగనాయకులపేట రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. రైలు వచ్చే సమయంలో రైలుగేటు వేస్తుండడంతో వాహనాల రద్దీ పెరిగిపోయింది.

సండే మార్కెట్ మూసివేత

నెల్లూరు(విద్య) : గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు రోడ్డుపై నాలుగడుగులకు పైగా వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీగా నీరు చేరడంతో రోడ్డును మూసివేశారు. దగ్గరలోని సండే మార్కెట్ వీధుల్లోకి వర్షపు నీరు చేరడంతో డివైడర్లతో మూసివేశారు.

నెల్లూరు(బీవీనగర్): నగరంలోని బీవీ నగర్‌లో రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచిపోయింది. పొదలకూరు రోడ్డు, పోలీసు కార్యాలయం, కరెంటాఫీసు సెంటరు, మినీబైపాసు రోడ్డు తదితర ప్రాంతాల్లోని సైడు కాలువల్లో నీరు పొంగి రోడ్లపై ప్రవహించింది.

కూలిన ప్రహరీ

నెల్లూరు(జడ్పీ): బ్రహ్మానందపురంలో విద్యుత్ నియంత్రిక పక్కన నిర్మించిన ప్రహరీ, మూలాపేట సమీపాన డైకాస్‌రోడ్డు గచ్చు కాలువ వద్ద ప్రహరీ కులిపోయాయి. గొల్లవీధిలో బీఎస్ఎన్ఎల్ స్తంభం పడిపోయింది. సరస్వతీనగర్‌లో రోడ్డువైపు వాలిన చెట్టును రెండు రోజులుగా తొలగించలేదు.




మినీబైపాసు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు.. డైకస్‌రోడ్డు వద్ద కూలిన ప్రహరీ



నెల్లూరు: అండర్‌బ్రిడ్జిలో నీరు నిల్వకుండా పనులు చేయిస్తున్న కమిషనర్ సూర్యతేజ

అధికారులు అప్రమత్తం

నెల్లూరు(కలెక్టరేట్) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. భారీ వర్షాలు, తుపాను ముప్పు ఉంటుందని ముందస్తు హెచ్చరికలతో కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 312 కుటుంబాల్లోని 950 మందిని తరలించారు. కేంద్రాల్లో ప్రజలకు భోజనం, తాగునీరు, పాలు, దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించారు. సముద్రతీర ప్రాంత మండలాల తహసీల్దార్లను అప్రమత్తం చేసి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరాకు విద్యుత్తు అంతరాయం లేకుండా వాటర్ ట్యాంకుల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్, నగరపాలకసంస్థ, మండల కేంద్రాల్లో కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేయించారు.

బాధితులకు చేయూత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వర్ష బాధితులను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఇందిరమ్మ కాలనీ, వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వర్ష బాధితులకు బుధవారం ఆహార పొట్లాలు, మంచినీటి ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌జైన్, సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, బ్లడ్ సెంటర్ కన్వీనర్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండగగా వాల్మీకి జయంతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నరసింహానందపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి ప్రదాత మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నరసింహానంద సరస్వతిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనార్టీ మత పెద్దలు డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరులోని కోటమిట్ట నుంచి గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మైనార్టీ నాయకులు సయ్యద్ సమీ హుస్సేనీ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరసింహానంద సరస్వతిని దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒకటో నగర పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేకుంటే శుక్రవారం మరోసారి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ అజీజ్, ఆసిఫ్‌పాషా, సయ్యద్ హసన్ అహ్మద్, కాలేషా, అబూబకర్, జియా ఉల్‌హక్, మస్తాన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు నగర మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు. బుధవారం రంగనాయకులపేట పీఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

జడ్పీ ఛైర్‌పర్సన్‌తో డీపీవో భేటీ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో డీపీవో ఎల్.శ్రీధర్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. జిల్లా పంచాయతీ పరంగా పలు అంశాలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

రూ.50వేల విరాళం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: సింహపురి వైద్య సేవా సమితి(జయభారత్ హాస్పిటల్) నిర్వహిస్తున్న బాలసంస్కార కేంద్రానికి భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్ రూ.50వేల విరాళం ప్రకటించారు. వైద్య సేవా సమితి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కు విరాళం చెక్కును బుధవారం అందజేశారు.

ఆక్రమణలు.. కనిపించని ఆనవాళ్లు



సుబేదారుపేటలో కాలువపై పలకలు తొలగిస్తున్న జేసీబీ

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

ఆక్రమణల వల్ల ఏటా వర్షాకాలం, తుపానులకు వరద వెళ్లే దారిలేక నెల్లూరు నగరం ముంపు బారిన పడుతోంది. పాదచారుల సౌకర్యార్థం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కాలి బాటలను నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమించారు. కాలువలు ఆక్రమించి ర్యాంపులు, మెట్లు నిర్మించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రహదారులు ఇరుకుగా మారిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలను మూసేశారు. వరద బయటకు వెళ్లే వ్యవస్థ లేకపోవడం, కాలువలు ఆక్రమణలకు గురికావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాలువలపై నిర్మాణాలు

పట్టించుకోని ప్రణాళిక విభాగం

కాలువల్లో పూడిక తీసిన మరుసటి రోజే ఆక్రమణదారులు వాటిపై సిమెంటుతో నిర్మాణాలు చేపడుతున్నా.. నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో నీటి తరలింపు సామర్థ్యం కోల్పోతున్నాయి. నగరంలోని జీఎన్‌టీరోడ్డు, పొగతోట, గాంధీబొమ్మ సెంటరు, చిన్నబజారు, ములుమూడి బస్టాండు, ట్రంకురోడ్డు, సుబేదారుపేట, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో కాలువలను ఆక్రమణలకు గురయ్యాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పలు సంస్థలు, దుకాణాలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల యజమానులు కాలువల్లో పూడిక తీయడానికి వీలులేకుండా వాటిపై సిమెంటుతో ప్లాస్టింగ్ చేయించారు. పార్కింగ్ స్థలంగా వినియోగిస్తున్నారు. ఓ వైపు వర్షాలు పడుతుంటే.. మరో వైపు జేసీబీలతో కాలువలపై ర్యాంపులు, మెట్లు తొలగించి పూడిక తీస్తుండటం గమనార్హం. దీన్నిబట్టి ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలపై ఆక్రమణలు అడ్డుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



తల్పగిరి కాలనీలో కాలువలో అడ్డంగా వేసిన పైపును తొలగిస్తున్న సిబ్బంది

● ఆక్రమణలపై నగరపాలక కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ కాలువలపై ఆక్రమలు తొలగించి వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పల్లె పండగలో పనులు ప్రారంభం

నెల్లూరు(జడ్పీ) పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం 32 అభివృద్ధి పనులు ప్రారంభించారు. దాదాపు 4.53 కిలో మీటర్ల పొడవున సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.1.94 కోట్ల విలువతో పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్ వెల్లడించారు. కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు గ్రామీణ పరిధిలో వివిధ గ్రామాల్లో పనులకు శంకుస్థాపన చేశారు.

పేద ప్రజలను ఆదుకోండి

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా జిల్లాలో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని భాజపా ఓబీసీ మోర్చా కోస్తా ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ముక్కు రాధాకృష్ణ గౌడ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలకు వసతుల కల్పన

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20, 23, 32 డివిజన్‌ల పరిధిలో తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అధికార యంత్రాంగంతో కలిసి బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. * కాకుపల్లి గ్రామంలో రూ.10లక్షలతో డ్రెయిన్, సీసీ రోడ్డు పనులకు తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: వరిలో వచ్చే చీడపీడలు, తెగుళ్ల గురించి అవగాహన కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపట్టాలని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం దొంతాలి, అంబాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. మండల వ్యవసాయాధికారి ఎస్‌వీ నాగమోహన్, వ్యవసాయ సహాయకులు విజయసారథి, కారుణ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయని తండ్రి మందలించడంతో బాలుడు ఇంటి నుంచి పరారయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. ఫత్తేఖాన్‌పేటలో సురేఖ, కార్తీక్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు గౌతమ్ మూలాపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో ఈ నెల 12న తండ్రి మందలించారు. మనస్తాపానికి గురైన బాలుడు ఈ నెల 14న తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి సురేఖ బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.